


# ఆనాడు ఆషాఢ శుద్ధ పాడ్యమి

[గత సంచిక తరువాయి.]

పుస్తకాలు ఇదివరకు నేను కేవలం కాలయాపనకోసం చదివేదాన్ని. ఆపుస్తకాలే ఇప్పుడు నాజీవితానికి సౌఖ్యం చేకూర్చే ఉపకరణాల్లో ముఖ్యమైనవిగా మారిపోయాయి. ఎందువల్ల? అబ్బాయే ఆపుస్తకాలు తెచ్చియిస్తూఉంటాడు. నేనిదివరకు మావాదినా దొడ్డమ్మా బలవంతాన పాడిపాడి విసువెత్తినపాటలే ఇప్పుడు నానోటంటవస్తే ఎంతో వింతగానూ, అమృతమయంగానూ ఉన్నట్టు నాకే తోచేవి. కారణం? గది లోగుమ్మంలో కూచుని అబ్బాయి **వాటిని** విని మెచ్చుకుంటూ ఉంటాడు.

ఎప్పుడైనను చల్లని వెన్నెలరాత్రులలో అబ్బాయితోకలిసి మేమందరం సముద్రపుటొడ్డుకు సరదాగా షికారువెళ్ళినప్పుడు ఎంత కాలమాయి ఎప్పుడూ చూస్తున్నవే అయినా అగాధమైన ఆ సముద్రం, దానిలోంచి కొండలవలె పైకిలేచే ఆతరంగాలూ, అవి పేలిపోయేటప్పుడు వాటిలోంచి రాసులురాసులుగా పైకితుళ్ళి పండువెన్నెట్లో తళతళ మెరిసే నీటిముత్యాలూ—పైన అనంతనీలిమాకాశం, దానిగుండా ఈదే మబ్బుతెరలూ, అవిపక్కకు తరిలేటప్పుడు మిలమిల తొంగిచూసే నక్షత్రరాసులూ అన్నీ తిలకిస్తూ ఉంటే వాటన్నిటిలోనూ ఏదో అపూర్వమైన ప్రకృతి రహస్యం, అమూల్యమైన భగవత్సందేశం అంతర్యామిత్వమై ఉన్నట్లు, వాటిని గ్రహించి మెచ్చుకోగలిగే శక్తి నాలోకూడా ఏమూలో యిమిడి ఉన్నట్లు నాకర్థమయేది. పైగా, భగవత్స్వరూపమే ప్రకృతిరూపంతో భూమిమీదనూ, దేవతాస్వరూపంతో ఆకాశంలోనూ నిండిఉన్నట్లు నామనస్సుకి తట్టేది.

ఇప్పుడుకూడా అబ్బాయి వెక్కిరింపులధోరణి ఏమీ తగ్గకపోగా దినేదినే అధికమవుతున్నదని కూడా చెప్పవచ్చును. అయినా వాటి వ్యాఖ్యానమాత్రం వేరని తెలుసుకోగలిగినందున అవి నాకు కోపానికిబదులు ఇప్పుడు ఆనందాన్నే చేకూరుస్తున్నాయి.

'ఉమ నిద్రపోయిందంటే ఏనుగులు మీదనుంచి నడిచినను తెలీదు' అనేవాడొకప్పుడు.

'ఎనిమిదిగజాలచీరైనా ఉమకి సరిపోతుందో చాలదో అనుమానమే'అని ఇంకోసారనేవాడు.

ఆమాటలవల్ల నాకు మొద్దునిద్రనీ, నేను లావుగాఉంటాననే అర్థములే పైకి స్ఫురించినా అబ్బాయి చెప్పదలుచుకున్నది మాత్రం వేరని నాకు తెలుసు. అదేమిటంటే 'ఉమా! ఎప్పుడూ నేను నీగురించే తలపోస్తూ ఉంటాను. ఎన్నటికీ నిన్ను మరిచిపోలేను' అని. అతని చూపులూ, చేష్టలూ, వైఖరీ, ముఖంలోని భావాలూ అన్నీ ఆసంగతే తెలియజేసేవి.

ఇలాగే ప్రతి విషయంలోనూ అతడు మాట్లాడుతున్నదానికంటె, చెబుతున్నదానికంటె, అడుగుతున్న దానికంటె—మాటాడదలుచుకున్నదీ, చెప్పదలుచుకున్నదీ, అడగదలుచుకున్నదీ వేరుగానే ఉన్నట్లు నాకు ధ్వనించేవి. నాప్రశ్నలూ, జవాబులూ కూడా వాటికనుగుణంగానే ఉండేవని గ్రహించలేని వారెవరూ వుండరు.

## ౭

ఆనాడు ఆషాఢశుద్ధపాడ్యమి. నాకు బాగాజ్ఞాపకముంది. జ్ఞాపకమేమిటి? ఆత్మనేదే శాశ్వతమైందని ఒప్పుకుంటే ఈ శరీరంపోయినను జన్మజన్మాంతరాలవరకూ ఆరోజును నేను మరిచిపోలేను. ఒక్క నేనేకాదు—

> 'ఆషాఢస్య ప్రథమదివసే మేఘమాశ్లిష్టసానుం
> వప్రక్రీడా పరిణతగజ ప్రేక్షణీయందదర్శ ॥'

అని వెయ్యి సంవత్సరాలక్రిందట మహాకవి కాళిదాసు స్వాగతమొసగిన ఆ పవిత్రదివసమును ఆర్యావర్తంలో ఎవ్వరూకూడా మరిచిపోదామన్నను మరిచిపోగలుగుతారని నేననుకోను.

ఆనాడు హైస్కూలు వార్షికోత్సవం. ఉపాధ్యాయులకూ, విద్యార్థులకూ ఉత్సాహంతో, కార్యక్రమం సాగించవలసిన పూచీతో ఊపిరితిరగకుండా ఉన్నది. అందులో బాలికలచేత శాకుంతలనాటకమభినయింపజేయవలసిన పూచీ మా ఆయనమీద పడింది. శకుంతలపాత్ర ధరించవలసినది మాచెల్లెలే. ఉదయంనుంచి నాటకంలో పాత్రలు వహించే పిల్లలందరూ మాయింటివద్దనే ఉండి ఎవరిభాగములను వారు వల్లెవేసుకుని అభినయించి చూసుకుంటున్నారు. సాయంత్రం నాలుగుకాకపూర్వమే పిల్లలనందర్నీ తోడ్కొని మావారు బడికి బయల్దేరారు. వారి హడావుడి చూస్తే రాత్రి ఏడెనిమిది గంటలవరకూ ఇంటికి చేరుకునేటట్టు లేదు.

ఆనాడు దినమల్లా చాలాతీక్ష్ణంగా ఎండకాచి సాయంత్రం అయిదు కాకపూర్వమే చిన్నచిన్న తెల్లని మబ్బుతెరలు రాసులురాసులుగా కుందేళ్ళమందవలె ఆకాశమంతటా గునగున సంచరించడం మొదలుపెట్టాయి. వాటితో పరిగెత్తడానికి పందాలు వేసుకుని వెనకబడ్డ మేకలమందవలె దట్టమైన కారుమబ్బులు ఉరుముకుంటూ వాటిని వెంబడిస్తున్నాయి. త్రుటికాలంలోనే తెల్లమబ్బులు మాయమై నీలిమాకాశం, సంధ్యారాగం, అస్తమించే సూర్యుడూ అన్నీ కారుమబ్బుల్లో మిళితమైపోయేయి.

ఆబరునైన మేఘాలధోరణి చూస్తే ఏనిముషానైనను వర్షరూపందాల్చి కిందకుజారిపోయేటట్టుంది. రెండుమూడు మాసాలబట్టి తీక్ష్ణమైన ఎండల్లో వేగిపోతున్న ప్రజలకు ఆ

చల్లని నీటిగాలీ, దర్శనీయమైన మబ్బులూ, కాలాన్నికూడా పావనంచేసే అందమైన ఆదినం ఎంత అమూల్యమైనది? ఈ పవిత్రదివసానికి, ఈ మేఘదూతకు ఉజ్జయినీ మహాకవి కాళిదాసు స్వాగతమొసగీ ఎంతకాలమైంది? ప్రతి సంవత్సరంలోనూ ఆదినము చుక్కలమధ్య చంద్రునివలె అంత ఆకర్షణీయంగానే, అంత శోభతోనే ప్రకాశిస్తూంది. ఈరోజునకూడా ఎంతమంది ప్రజలు అతికుతూహలంతో ఎత్తినతలలు దించకుండా ఆకసమువంక తిలకిస్తూ స్వాగతమిస్తున్నారు ఆమేఘోదయానికి? అటువంటి సమయంలోకూడా మానవనిర్మితమైన ఇటికపెట్టెలమధ్య నలుక్కుపోయే వింతప్రకృతులు కొందరుంటారు. వెలుపలికి వస్తే ఒకవేళ చల్లనినీటిముత్యాలుపడి శరీరం తడిసిపోతే—? ఎంతప్రమాదం!

నాకుమాత్రం చీకటిగదిలో ఒంటరిగా కూచోడం దుర్భరమైంది. జానకిగారింటికి బయల్దేరాను. నేనూ వాళ్ళగుమ్మం ఇంకా ఎక్కానో లేదో దడదడా చినుకులు ప్రారంభమయేయి. వీధితలుపు జార్లవేసిఉంటే మెల్లగా తెరిచి లోనికివెళ్లాను. లోన ఎవ్వరూ కనబడలేదు. ఇల్లంతా నిశ్శబ్దంగా నిద్రపోతున్నదా అనిపిస్తూంది. గదిలోనున్నారేమోనని గది తట్టువెళ్లి 'వొదినా' అనిపిలిచాను. అబ్బాయి కంఠస్వరం జవాబిచ్చింది. 'ధర్మంగారింటికి వెళ్లారు. ఇప్పుడే వస్తారు.' పైన హోరునవాన. అయినను వెళ్లిపోబోయాను.

ఆహోరులో 'ఉమా' అని ఏదోపిలుపు వినబడినట్లయింది. అసంభవమనుకున్నాను. 'ఉమా, ఉమా!' ఇంకా మెల్లగా మృదువుగా వినబడింది. సంశయంలేదు. ఎంతహోరులోనైనా, ఎంత మెల్లగాఉన్నా ఆ గొంతుకెవరిదో పోల్చుకోడం నాకేమీ కష్టంకాదు. నిద్రలోనూ, కలలోనూ, వెయ్యి కంఠస్వరాల మధ్యనుకూడా ఆగొంతుకెవరిదో స్పష్టంగా గుర్తించగలను. నాహృదయం దడదడా కొట్టుగుంది. అవ్యక్తమైన ఆనందమూ, సిగ్గూ నన్నొకేసారి ముంచేశాయి. ఎటూకదలలేక గోడకానుకుని ఉండిపోయాను.

అబ్బాయేవచ్చి మృదువుగా నాచెయ్యి పట్టుకున్నాడు. సిగ్గుచే నాప్రాణాలు నిలువున ఎగిరిపోయాయి. ఏమీమాటాడకుండానే మెల్లగా, అతిచనువుగా నన్ను గదిలోకి తీసుకువెళ్లి కుర్చీలో కూచోబెట్టి పక్కకుర్చీలో తను కూచున్నాడు. అవ్యక్తమైన బెదురుతో, సిగ్గుతో నాశరీరం వణికిపోతూంది. కళ్లు మూతలుపడిపోతున్నాయి. తీయనిస్వరంతో అబ్బాయి పలుకులు :

'ఉమా! నీమీద నాకెంతప్రేమో నీకు తెలీదుకదూ! ఒక్కరోజు నీముఖం కనబడకపోతే బతకలేను.'

అది నిజంగా అబ్బాయి కంఠస్వరమేనా? అమృతవృష్టి నామీద కురిసినట్లయింది.

మళ్లీ అబ్బాయి కంఠస్వరమే :

'నీకు నాతలంపే ఉండదుకదూ!'

ముఖమెత్తి చూశాను. అతనికళ్లు కుతూహలంతో 'చెప్పవూ!' అని లాలిస్తున్నట్టు నావంకచూస్తున్నాయి. ఊరుకుందికి నామనస్సొప్పలేదు. సిగ్గుతో, చిరునవ్వు పెదవులతో, వణకుతున్న గొంతుతో అన్నాను :

'ఉందోలేదో నీకు తెలీదూ!'

అతనిముఖ మొక్కసారి బాలకుని ముఖంవలె కెంపుబారి వికసించిన గులాబీలాగు ప్రకాశిస్తూంది. ఏదోమాటాడాలని ప్రయత్నించాడుకాని, పెదవులు అడ్డుపడ్డాయి. నాకళ్లు అతని ముఖంవంకే చూస్తున్నాయి. నన్ను సేవ చేస్తూ, నామీద అధికారంచూపుతూ, నన్నాజ్ఞాపిస్తూ, నిత్యమూ నాలోపాలనే ఎంచిచూపాలని ప్రయత్నించే అబ్బాయిలాగు లేడప్పుడు. నామాటలనూ, చూపులనూ, ప్రేమనీ ఆరాధించే భక్తునివలె కనబడ్డాడు. ఇరువురమూ మాట్లాడకుండానే, ఏమిచేస్తున్నదీ తెలీకుండానే ఒకరివంక వొకరం చూస్తూ అలా ఉండిపోయాము.

అతని నేత్రాలు అంతకంతకూ ఏమో వింతగా వెలిగిపోతున్నాయి. నాకళ్లు వాటంతటవే మూతలుపడ్డాయి. ఏవో ఆలోచనలు నామనస్సులో పరిగెత్తుతున్నాయి. ఇంతలో అబ్బాయిచెయ్యి మెత్తగా, గులాబిపువ్వుంకంటె కోమలంగా నాబుజాన్ని తాకింది. అ...బ్బ! ఆస్పర్శ ఎంత మృదువుగా, ఎంతమధురంగాఉంది! నాశరీరం పులకరించింది. ఒక్కక్షణం నేను సర్వమూ మరిచిపోయాను. నేనున్నది భూమో స్వర్గమోకూడా నాకు తెలీలేదు.

అబ్బాయిచెంత సంతచనువుగా కూచున్న దినాలు, అతనిస్పర్శ ననుభవిస్తూ చెట్టాపట్టాలు వేసుకుని అతనితో స్వేచ్ఛగా తిరిగిన నిముషాలు, ఇరువురమూ ఎంతో సరదాగా కబుర్లు చెప్పుకుంటూ, చదువుకుంటూ, ఆడుకుంటూ, ఒకరిమాటల్లో ఒకర మానందించుకుంటూ గడిపిన బాల్యనాటకంలోని ముఖ్యమైన ప్రకరణాలు అన్నీ ఒక్కసారి ఫిల్ము తిరిగినట్టు నాకళ్లముందు గిర్రున తిరిగాయి.

అతని కింత చేరువగా అతని హృదయస్పందము నాహృదయస్పందమో అన్నట్టు వినబడేటంత చేరువగా కూచుని ఎంతకాలమైంది? అన్నాళ్లకు మళ్లీ ఈనాడు అబ్బాయికి, నాబాల్యస్నేహితుడికి ఇంత దగ్గరగా కూచోగలిగే అదృష్టం నాకు లభించింది. ప్రియతములలో కల్లా ప్రియతముడైన అబ్బాయి, నాఆనందంలో, ఆటల్లో, పాటల్లో, కష్టసుఖాల్లో భాగస్వామి అయిన అబ్బాయి, ప్రపంచమంతటికంటె నాకు సన్నిహితుడైన అబ్బాయి మళ్ళీ ఈనాడు నాపక్కకు వచ్చాడు. నేడు అతనిపక్కని నేనుతప్ప ఇంకెవ్వరూలేరు—

ప్రపంచమంతటా చీకటికమ్ముకుంది. అంతటా నిశ్శబ్దం - శాంతి! ఆనిశ్శబ్దంలో మేమిద్దరమే! మే మిప్పు డేమి చేసినా ఎవరికీ తెలీదు. ప్రమాదమేమీలేదు. అబ్బాయి చెయ్యి గట్టిగా, ఇంకాగట్టిగా నాబుజాన్ని అదుముతూంది. ఆహా! ఎంతహాయి!! అతనిముఖం, నేత్రములూ ఉద్రేకంతో వెలిగిపోతున్నాయి. లోకం, శరీరం కూడా మరిచిపోయేటప్పుడు కలిగే ఆనందం ఒక్కసారి నాకు కలిగింది. కాని—అటువంటిస్థితి ఎంతోకాలముండదు... హఠాత్తుగా స్వర్గసౌధంనుంచి ఎవరో నన్నొక్కసారి అమాంతంగా కిందకుతోసినట్లయింది. నా ఆనందమంతా ఒక్కసారి మాయమై అవ్యక్తమైన బెదరుగా, దిగులుగా మారిపోయింది. మేమిరువురమూ ఏదోతప్పుపని చేస్తున్నట్లు నాహృదయంలో ధ్వనించింది. వాయువేగాన పరిగెత్తుతున్న స్త్రీహృదయంలాగు నాహృదయం కొట్టుకోవడం మొదలుపెట్టింది.